కొద్ది సేపటికి ఆ వేటగాళ్ళు అక్కడికి వచ్చి ఈ ఇద్దరినీ చూసి అడిగారు.

"ఇటొచ్చిన జింక ఎటెళ్ళింది?"

రెండో సాధువు కొద్దిగా ఆందోళనగా వారి వంక చూసాడు.

మొదటి సాధువు మాత్రం అబద్ధం ఆడకుండా వారికి జవాబు చెప్పి జింకని ప్రమాదం నించి కాపాడాడు.

"మీరీ ప్రశ్న మమ్మల్ని అడగడం సమంజసం కాదు. మేము దాని తరఫున వున్నాం."

సాధారణంగా మనం ప్రపంచంలో ఆడే అబద్ధాల్లో ఎక్కువ శాతాన్ని ఎదుటివాళ్ళు ఏమనుకుంటారో అని నిజాన్ని నిష్కర్షగా చెప్పలేకపోవడం వల్లనే ఆడుతూంటాం.

## 120. దేవుడ్ని చూపించు

"స్వామి! దేవుడు అన్నిటా వుంటాడంటారు. అది నిజమేనా?"

"అవును."

"ఐతే ఈ అరటి పండులో కూడా వున్నాడా?"

"ఉన్నాడు."

"ఉంటే చూపించండి."

"ఇది బయటకి ఏ రంగులో వుంది?"

"పసుపు పచ్చగా."

"కాని ఆ పసుపు పచ్చ రంగు దేవుడు కాడు. లోపల ఏ రంగులో వుంది?"

"తెలుపు."

"కాని ఆ తెలుపు దేవుడు కాడు. పండు ఏ రుచిలో వుంటుంది?"

"తియ్యగా."

"కాని ఆ తీపిదనం దేవుడు కాడు. పండు స్పర్శకి ఎలా వుంటుంది?"

"మెత్తగా."

"కాని ఆ మెత్తదనం దేవుడు కాదు. పండు పైన ఏం వుంది?"

"తొక్క."

"కాని ఆ తొక్క దేవుడు కాదు. అరటి పండు ఏ పరిమాణంలో వుంది?"

"నిలువుగా వుంది."

"ఆ నిలువు దేవుడు కాదు. ఇవన్నీ కలిస్తేనే దేవుడు. అంతేకాదు. ఇవన్నీ కాక అరటిపండులో మనకి కంటికి కనపడని ఇంకేదో వుంది. అదే దానికి పైన పసుపు పచ్చ తొక్కని, లోపల మెత్తటి తీయనైన, ఆరంగుళాల పొడవైన పండుని సృష్టిస్తోంది. అదే దేవుడు."

"ఇప్పుడు దేవుడు గురించి అర్థమైంది స్వామి."

## 121. కొన్ని కష్టాలెందుకు పోవు?

ఒకడు అడవికి వెళ్ళి కొన్ని చెట్ల వంక పరీక్షగా చూసాడు. ఓ చెట్టు మీద ఓ గోరింక పిట్ట గూడు పెట్టడం గమనించి అతను ఆ చెట్టెక్కి దాన్ని పీకేసి ఇంటికి వెళ్ళిపోయాడు. మర్నాడు అతను వచ్చి మళ్ళీ ఆ చెట్టుని చూస్తే తను తీసేసిన చోట ఆ గోరింక మళ్ళీ కొత్త గూడుని పెట్టడం చూసి మళ్ళీ చెట్టెక్కి దాన్ని కూడా పీకేసి ఇంటికి వెళ్ళిపోయాడు. మూడో రోజు కూడా అతను అడవికి వెళ్ళి చూస్తే ఆ గోరింక ఇంకో కొమ్మ మీద గూడు పెట్టడం గమనించి, మళ్ళీ దాన్ని కూడా పీకేసి ఇంటికి వెళ్ళిపోయాడు.

నాలుగో రోజు అతను అడవికి వచ్చి చూస్తే ఆ గోరింక పిట్ట పక్కనే వున్న చెట్టు మీద కొత్త గూడుని కట్టుకోవడం చూసాడు. సంతృప్తిగా తలాడించి అతను ఇంటికి వెళ్ళిపోయాడు.

నెల రోజుల తర్వాత అతను అడవికి వచ్చి చూస్తే ఆ గోరింక గూట్లోని పిల్లలు అరుస్తూ కనిపించాయి. అప్పుడు వాడు తన భుజాన వున్న గొడ్డలిని తీసి తను గూటిని అనేక సార్లు పీకేసిన చెట్టుని తమ గ్రామంలోని దేవాలయం ధ్వజ స్థంభం కోసం కొట్టాడు. అతను ఆ గూడు పీకి ఉండకపోతే పక్క చెట్టు మీద ఆ పక్షి గూడుని కట్టి ఉండేది కాదు. గూట్లోని పిల్లలకి హాని జరిగేది.